క్లుప్తంగా

రైతులు పంటల నమోదు తప్పనిసరి



వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలను ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని ఏఈఓ గణేష్ కోరారు. బుధవారం మండలంలోని పెద్దాపూర్ క్లస్టర్ పరిధిలో పంటలను పరిశీలించి ఆన్‌లైన్ నమోదు చేశారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, ఏఈఓలు తదితరులు ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

పెద్దకొత్తపల్లి: వెనచెర్ల గ్రామానికి చెందిన చింతకుంట బాటపీరు అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. 1985–86 బ్యాచ్‌కు చెందిన మిత్రులు డబ్బులను పోగు చేసుకొని బుధవారం బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రామాచారి, మాధవాచారి, రామరావు, సురేందర్, బాపుమియ్య, యాదగిరి, మల్లరెడ్డి, వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



పెద్దకొత్తపల్లి: దేవల్‌తిర్మలాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈఓ శ్రీనివాస రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను, వంట గదులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, పాఠశాల పరిసరాల వంట గదులను పరిశుభ్రంగా నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమలో ప్రధాన ఉపాధ్యాయురాలు సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



కోడేరు: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకుకూరలు, పండ్లు, గుడ్లు తీసుకుంటే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందన్నారు. తప్పనిసరిగా ప్రతి నెలా ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం రక్త పరీక్షలు చేసి వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ నారాయణ, పీహెచ్‌ఓ సుదర్శన్, ఫార్మాసిస్టు దిలీఫ్, బూల్య, కళావతి, చంద్రకళ, సుజాత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళ అదృశ్యమైన ఘటనలో బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం తెలకపల్లి మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన ఇర్పానా జిల్లా కేంద్రంలో హరిజనవాడలో నివాసం ఉంటోంది. ఈనెల 17న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్, కారు ఢీ: ఇద్దరికి గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఇద్దరికి గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామం ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో నల్లవెల్లి గ్రామానికి చెందిన సంతోష్, లక్ష్మిలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని జనరల్ ఆస్పత్రికి తరలించారు. కారును నల్లవాగు వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సమస్యల భాండాగారం

- శిథిలావస్థలో గ్రంథాలయం
- పాఠకులకు తప్పని తిప్పలు



పెచ్చులూడిన పైకప్పు



తలుపులు లేని కిటికి



కూలేందుకు సిద్ధంగా ఉన్న గ్రంథాలయ భవనం

వెల్దండ: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం సమస్యలకు నిలయంగా మారింది. ఆరు దశాబ్దాల కిందట గ్రంథాలయ భవనం నిర్మించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. పదేళ్ల కిందట పాఠకులు, గ్రామస్తులు నూతన భవనం నిర్మించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ పంచాయతీ స్థలం ఉంటే రూ.20 లక్షలతో కొత్త భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కాని ఇప్పటికీ ఆచరణలో అమలు కాలేదు. ప్రభుత్వాలు, పాలకులు మారిన గ్రంథాలయం ఏర్పాటులో మాత్రం మార్పు రావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

పుస్తకాలు కరువు

స్వాతంత్య్ర ఉద్యమ సమయంలో వెల్దండ గాంధీగా పిలిచే బిక్కుమాండ్ల ముత్యాలు సహకారంతో గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గ్రంథాలయంలో కనీస పుస్తకాలు కూడా అందుబాటులో ఉండటం లేదు. పోటీపరీక్షలకు సంబంధించిన పుస్తకాలు సమకూర్చడంలో నిర్వాహకులు విఫలం అయ్యారు. పేద విద్యార్థులు ఉద్యోగాలకు సన్నద్ధం అయ్యేందుకు వెనకడుగు వేస్తున్నారు. అరకొర పుస్తకాలు, దిన పత్రికలతో కాలం వెళ్లదీస్తున్నారు.

అరకొర వసతులు

అరవై ఏళ్ల కిందట నిర్మించిన గ్రంథాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. కనీస వసతులు లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. కూర్చోవడానికి కూడా కుర్చీలు లేక అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో గ్రంథాలయ ఆవరణలోకి మోకల్లోతు నీరు నిలుస్తోంది. పైకప్పు పెచ్చులు ఊడిపడుతుండటంతో పాఠకులు భయాందోళనకు గురవుతున్నారు. చుట్టు పిచ్చిమొక్కలు, కంపచెట్లు దర్శనమిస్తున్నాయి.

పుస్తకాలు అందుబాటులో ఉంచాలి



గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచాలి. విషయం పరిజ్ఞానం కోసం అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలి. ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వీడాలి. నిధులు కేటాయించి కొత్త భవనాన్ని నిర్మించాలి. – రామకృష్ణ, వెల్దండ

ప్రతిపాదనలు పంపించాం

గ్రంథాలయ నూతన భవన నిర్మాణం కోసం అప్పట్లో తీర్మాణం చేసి నివేదికలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. స్థల దాతలు ముందుకు వస్తే దాదాపుగా రూ.20 లక్షలతో నూతన భవనాన్ని నిర్మిస్తాం. గతంలో స్థలం అందుబాటులో లేకపోవడంతో భవనం మంజూరు కాలేదు. త్వరలోనే నూతన భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. – హన్మంత్, లైబ్రేరియన్, వెల్దండ

ముమ్మరంగా అడ్మిషన్ డ్రైవ్

కల్వకుర్తి రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం అడ్మిషన్ డ్రైవ్ ముమ్మరంగా నిర్వహించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని మార్చాల, తాండ్ర, రఘుపతి పేట, చారగొండ, గుండూరు, రఘుపతి పేట గ్రామాల్లోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులను ఉపాధ్యాయులు కలిశారు. ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య అందుతుందని వివరించారు. విద్య, విజ్ఞానం, క్రమశిక్షణ, దేశ భక్తి అలవడుతుందన్నారు. ప్రైవేట్ కళాశాలలో చదివి డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరారు. కార్యక్రమంలో వేణు, సదానందం గౌడ్, మల్లేష్, శ్రీనివాస్, భీమేష్, రాజేష్, బాలరాజ్, రమాకాంత్ పాల్గొన్నారు.



మార్చాలాలో విద్యార్థులకు సూచనలు చేస్తున్న కళాశాల అధ్యాపకులు

శివమాలధారులకు వైద్య శిబిరాలు ఏర్పాటు

దోమలపెంట: మహాశివరాత్రి పురస్కరించుకుని పాదయాత్ర ద్వారా శ్రీశైలానికి వచ్చే శివమాలధారుల కోసం బుధవారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో దోమలపెంట, ఈగలపెంట ప్రాంతంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ హేమ, ఏఎన్‌ఎం మాసమ్మ, ఆశవర్కర్లు భాగ్య, కమల ఉన్నారు.

శివమాలధారులకు అన్నదానం

అచ్చంపేట: శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర దేవస్థానంలో వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం శివమాలధారులకు ఉచిత అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు అన్నదానం కార్యక్రమం కొనసాగనుంది. కార్యక్రమంలో ఉమామహేశ్వరం ఆలయ కమిటీ అధ్యక్షుడు బీరం మాధవరెడ్డి, ఏఓ శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, మన్సూర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



ఉమామహేశ్వరం ఆలయంలో అన్నదానం చేస్తున్న నాయకులు

105 తులాల వెండిధారపాత్ర బహూకరణ




వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామ లింగేశ్వరస్వామి దేవాలయానికి పోతేపల్లి గ్రామానికి చెందిన జబ్బు మల్లేష్ యాదవ్, తిరుపతమ్మలు రూ. 1.26 లక్షల విలువ చేసే 105తులాల వెండి ధారపాత్రను బహూకరించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దాతలను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో సాయికిరణ్, లింగయ్య, లక్ష్మమ్మ, అర్చకులు తదితరులు ఉన్నారు.

నిబంధనలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్లు

వీపనగండ్ల: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మప్ప, ఎంపీడీఓ శ్రీనివాసారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటి నిర్మాణంలో ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో అర్హత ఉన్నవారిని గుర్తించడం, ఇంటి నిర్మాణంలో ఖాళీ స్థలంతో పాటు నిర్మాణ ప్రారంభ ఫొటోలను కూడా ఆన్‌లైన్ ద్వార నమోదు చేయాల్సి ఉంటుందని ఆయన అన్నారు. ఇంటి నిర్మాణ దశలను గుర్తించి 4 విడుతల వారిగా రూ.5 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్యయాదవ్, నారాయణరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, బిచ్చన్న, రవీందర్‌రెడ్డి, గోపి, విష్ణు, వెంకటేష్, కావలి మహేష్, వెంకటరాజయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా వ్యవహరించారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయుల వేషధారణలో ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నాగర్‌కర్నూల్ మండలంలోని గన్యాగుల ప్రాథమికోన్నత పాఠశాల, తాడూరు మండలంలోని చెర్లతిర్మలాపురం, ఇంద్రకల్ పాఠశాలలలో, కొల్లాపూర్ మండలంలోని సింగోటం జెడ్పీహెచ్‌ఎస్‌లో, వెల్దండ మండలంలోని పెద్దాపూర్ ఉన్నత పాఠశాలలో, లింగాల మండలం జెడ్పీహెచ్‌ఎస్‌లో స్వయం పరిపానల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో తాడూరు, లింగాల ఎంఈఓలు శ్రీనివాస్‌రెడ్డి, బషీర్ అహ్మద్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గన్యాగుల ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

క్రమశిక్షణతో మెలగాలి

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో గల ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవ సమాజ నిర్మాణంలో విద్యా ఆవశ్యకత కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ రవీందర్ హాజరయ్యారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వై. కృష్ణయ్య, అధ్యాపకులు ధర్మ, భూదాన సుబ్బారావు, చైల్డ్ వెల్ఫేర్ కార్యకర్త లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం: డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష విధించనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్‌పై ఈ నెల 17న డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. వనపర్తికి చెందిన మహ్మద్ రఫీ, తాడూరుకు చెందిన మల్లయ్యలు పోలీసులకు పట్టుబడ్డారు. బుధవారం న్యాయమూర్తి ఎదుట వారిని హాజరుపర్చగా మహ్మద్ రఫీకి రెండురోజుల జైలు శిక్ష, మల్లయ్యకు ఒకరోజు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని ఎస్‌ఐ పేర్కొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ మార్చాలని వినతి



కొల్లాపూర్: మండలంలోని ఎర్రగట్టు బొల్లారం గ్రామానికి తాగునీటి పైప్‌లైన్‌ను మార్చాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఎర్రగట్టు బొల్లారం గ్రామస్తులతో కలిసి మిషన్ భగీరథ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, మహేష్, నిరంజన్, చంటి, నాగరత్నం, నర్సింహ్మ తదితరులున్నారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలి

పాన్‌గల్: చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సీహెచ్‌ఓ రామయ్య అన్నారు. బుధవారం మండలంలోని శాగాపూర్ సబ్‌సెంటర్‌ను సందర్శించి వ్యాధి నిరోధక టీకాల పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించేలా వైద్య సిబ్బంది తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు సరైన సమయంలో మొదటి, రెండో డోస్ టీటీ వ్యాక్సిన్ వేయించుకునేలా సిబ్బంది చూడాలన్నారు. దీంతో పాటు గ్రామాల్లో నిర్వహిస్తున్న మధుమేహ(షుగర్) పరీక్షలు 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ చేయించుకొని వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుమిత్ర, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిభావంతో మెలగాలి

తెలకపల్లి: ప్రతి ఒక్కరు భక్తి భావంతో మెలగాలని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శివాలయంలో శివమాలధారులకు ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇరుముడి స్వాములకు అన్నప్రసాదం చేశారు. ఆయన వెంట సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, నిరంజన్, బాలగౌడ్, రాజరెడ్డి, రఘుకుమార్, కుర్మయ్య, అంజనేయులు, శారద, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శివమాలధారులకు మెడికల్ క్యాంపు

కందనూలు: జిల్లా కేంద్రంలో ఓల్డ్ కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా ప్రధాన మంత్రి జన ఔషధి, న్యూలైఫ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ మైనారిటీ యూత్ సహకారంతో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. బుధవారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం శివమాలధారులకు మాత్రలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కొత్త శ్రీనివాసులు, సునేంద్ర, జక్కా రాజు, నిజాం, బాదం నరేందర్, మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

బిజినేపల్లి: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. గంగనమోని తిరుపతయ్య, కత్తె ఈశ్వర్, నసీర్, మిద్దెరాములు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

తిమ్మాజిపేట: మండలంలోని ఐతోల్‌లో నాల్గో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల పోస్టర్లను బుధవారం ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ఆవిష్కరించారు. వచ్చే నెల మార్చి 1, 2వ తేదీలలో పోటీలు నిర్వహిస్తునట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి 10 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్: 8688553747, 7416921075 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



పెద్దకొత్తపల్లి: గంజాయి, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్‌ఐ సతీష్, ఎక్సైజ్ ఎస్‌ఐ శివకృష్ణలు అన్నారు. బుధవారం రాత్రి పెద్ద కార్పాముల, చిన్నకార్పాములు, జొన్నలబొగుడ, చంద్రబండ తండాలలో ఎక్సైజ్ పోలీసు అధికారులు గంజాయి, మత్తు పదార్థాలపై యువతకు, ప్రజలకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. గ్రామాలలో మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు ఉల్లంఘించొద్దు

చారకొండ: వాహనదారులు రోడ్డు నిబంధనలు ఉల్లంఘించొద్దని ఎస్‌ఐ శంషోద్దిన్ అన్నారు. బుధవారం మండల కేంద్రం సమీపంలో కల్వకుర్తి–దేవరకొండ జాతీయ రహదారిపై రోడ్డు భద్రత, ప్రయాణికులు తీసుకోవాల్సిన జాగ్రతలపై, వాహనదారులకు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ అతి వేగం ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ తిరుమల్ రావు, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం బుధవారం శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న శివమాలధారులను గుర్తు తెలియని ద్విచక్రవాహనం మండలంలోని రాంరెడ్డిపల్లి–తెలకపల్లి గ్రామాల మధ్య దాస్‌పల్లి గేట్ సమీపంలో ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడుకి తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరి శివమాలధారులకు స్వల్పగాయాలయ్యాయి. బాధితుడిని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

యూరియా నిల్వల పరిశీలన



పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో, ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా నిల్వలను బుధవారం ఏఓ రాజవర్ధన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ విండో కార్యాలయంలో 800 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని, ఇంకా మూడు లారీల యూరియా బస్తాలు వస్తాయన్నారు. ఫర్టిలైజర్ దుకాణదారులు రైతులకు యూరియా అందించేందుకు ఇబ్బందులు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువతరానికి స్ఫూర్తి.. శివాజీ



పెంట్లవెల్లిలో శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా బుధవారం ఛత్రపతి శివాజీ 395వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి హాజరయ్యారు. పోరాట ప్రతిమకు, ధీరత్వానికి నిదర్శనం ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కల్వకుర్తి మండలంలోని తోటపల్లిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. తిమ్మాజిపేట మండలంలోని పోతిరెడ్డిపల్లిలో గ్రామ యూత్ ఆధ్వర్యంలో యువకులు శోభాయాత్ర నిర్వహించారు. శివాజీ మహారాజ్‌కు జై అంటూ నినాదాలు చేశారు. పెంట్లవెల్లి మండల కేంద్రంలో శివాజీ విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కొల్లాపూర్‌లో భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ ఆయన పాల్గొన్నారు. తెలకపల్లి, ఉప్పునుంతల, పెద్దకొత్తపల్లి, కోడేరు మండల కేంద్రంతో పాటు ఎత్తం, పస్పులలో, చారకొండ మండలంలోని చంద్రాయన్‌పల్లి, మన్ననూర్‌లోని వేణుగోపాల స్వామి ఆలయం ప్రాంగణంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో, లింగాల మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో శివాజీకి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శివాజీ సేవా సమితి నాయకులు బ్యాగులను, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు.



నాగర్‌కర్నూల్‌లో శివాజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



మన్ననూర్‌లో..



పెద్దకొత్తపల్లి మండలం పెద్దకారుపాములలో..



తిమ్మాజిపేటలో..